## క్లుప్తంగా

### బుద్ధ అవతారంలో భజేనారాయణస్వామి



బుద్ధ అవతారంలో దర్శనమిస్తున్న భజేనారాయణస్వామి

రంగంపేట: వడిశలేరు శ్రీదేవిభూదేవి సమేత భజేనారాయణ స్వామి వారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని దశావతారాల్లో భాగంగా ఆదివారం స్వామిని బుద్ధ అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకష్ణమాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కృష్ణ అవతారంలో ఉన్న స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సోమవారం వైకుంఠ ఏకాదశి(ముక్కోటి ఏకాదశి) సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని, మధ్యాహ్నం గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ముమ్మన రాంబాబురెడ్డి తెలిపారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ ఆచార్య జగన్నాథరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించిన 'నాక్' గుర్తింపును 2022లో సాధించామని, అదేవిధంగా 2023 కూడా అత్యుత్తమ ఫలితాలు, ప్రగతిని సాధిస్తూ, దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా 'నన్నయ' అభివృద్ధిని సాధించాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లకు చెందిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### డ్రైనేజీపై కల్వర్టు నిర్మాణం

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో డ్రైనేజీపై కల్వర్టు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. స్థానిక కాపుల కాలనీ రామాలయం వద్ద కల్వర్టు లేక గ్రామస్తులు ఇబ్బందులకు గురికావడంతో గ్రామ సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో ఈ కల్వర్టు నిర్మాణం చేపట్టారు. కల్వర్టు నిర్మాణంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### దుప్పలపూడిలో 4 నుంచి గడప గడపకూ..

అనపర్తి: మండలంలోని దుప్పలపూడిలో ఈ నెల 4, 5 తేదీల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం చేయడానికి పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

### నేడు ఏకాహ మహోత్సవం

రంగంపేట: రంగంపేట గ్రామంలో కొలువైయున్న అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం ముక్కోటి ఏకాదశి(వైకుంఠ ఏకాదశి) సందర్భంగా ఏకాహ మహోత్సవం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం 24 గంటలు పాటు ఏకధాటిగా ఏకాహం నిర్వహిస్తామని గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు ఆదివారం తెలిపారు.



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న అనపర్తి, బిక్కవోలు జెడ్పీటీసీలు, నేతలు



సతీమణి డాక్టర్ రాజశ్రీతో కలిసి సర్వదేవతా హోమంలో పాల్గొన్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



తాము తయారుచేసిన హ్యాండీక్రాఫ్ట్ వస్తువులను ఎమ్మెల్యే దంపతులకు అందజేస్తున్న రవీంద్రభారతి విద్యార్థులు

# కొత్త కాంతులు... కొంగొత్త ఆశలు

- అంబరాన్నంటిన నూతన సంవత్సర వేడుకలు
- కిటకిటలాడిన నేతల నివాసాలు

అనపర్తి: నూతన సంవత్సర ఆగమన వేళ సంబరాలు అంబరాన్నంటాయి. ప్రజలంతా 2022కు వీడ్కోలు చెబుతూ 2023 సంవత్సరాన్ని ఘనంగా స్వాగతించారు. కుర్రకారు పార్టీలతో హోరెత్తిస్తే, చిన్నారులు గ్రీటింగ్ కార్డులతో హల్‌చల్ చేశారు. కార్యకర్తలు, అభిమానుల తాకిడితో నేతలు, ప్రముఖుల నివాసాలు కిటకిటలాడాయి. ఒకరికొకరు పూలబొకేలు, గ్రీటింగ్‌కార్డులు, స్వీట్లు ఇచ్చుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

**ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ**

నూతన సంవత్సర వేళ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నియోజకవర్గంలోని పెదపూడి, రంగంపేట, బిక్కవోలు, అనపర్తి మండలాల నుంచి భారీగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు ఎమ్మెల్యే స్వగృహం వద్ద సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సంవత్సరమంతా ఆనందమయం కావాలని నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

**బొకేలు, పూలదండల స్థానంలో పుస్తకాలు**

2020 నుంచి కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చేవారు పుష్పగుచ్ఛాలు, పూల దండలు, స్వీటు బాక్సులు, పండ్లతో రావొద్దని పంపిన ముందస్తు సందేశానికి అనూహ్య స్పందన వచ్చింది. శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన వారంతా ఎమ్మెల్యే దంపతులు ఏర్పాటు చేసిన వైఎస్సార్ పుస్తక నిధికి లాంగ్ నోట్ బుక్స్, విద్యా సామగ్రిని అందించారు.

పెదపూడి: మండలంలోని అన్ని ఏసుక్రీస్తు ఆలయాల్లో నూతన సంవత్సర వేడుకలు క్రైస్తవ భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దైవజనులు(పాస్టర్లు) శనివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ అర్ధరాత్రి 12 గంటలకు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు.

బిక్కవోలు: జిల్లా మహిళా సంక్షేమ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, ఊలపల్లి ఎంపీటీసీ బండారు శివ, కొంకుదురు ఎంపీటీసీ కొంకుదురు పీవీ తదితరులు అనపర్తిలో గంగిరెడ్డి నర్సింగ్ హోంలో ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామానికి చెందిన రవీంద్రభారతి స్కూల్ చిన్నారులు తమ సృజనాత్మకతతో తయారు చేసిన వివిధ హ్యాండీక్రాఫ్ట్ వస్తువులు ఎమ్మెల్యే దంపతులకు అందజేసి శుభాకాంక్షలు తెలియజేసి ఆకట్టుకున్నారు.

**నూతన ఉత్సాహం**

రాజానగరం: కొత్త ఏడాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. నూతన సంవత్సర వేడుకలు రాజమహేంద్రవరంలోని ఆయన స్వగృహంలో ఆదివారం ఘనంగా జరిగాయి. రాజానగరం నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు భారీగా తరలివచ్చి, ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి సమయాలలో సాధారణంగా పూలదండలు, బొకేలు తీసుకువస్తారు. అయితే ఎమ్మెల్యే రాజా సూచనల మేరకు బొకేలకు బదులుగా విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు తీసుకువచ్చి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, సిటీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ప్రజా సంక్షేమాన్ని కోరుతూ నిర్వహించిన సర్వదేవతా హోమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి డాక్టర్ రాజశ్రీ పాల్గొని వేదపండితుల ఆశీస్సులు అందుకున్నారు. ఎంపీపీ మందారపు సీతారత్నం శ్రీకృష్ణపట్నంలోనూ, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న రాధేయపాలెంలోనూ వారి స్వగృహాల వద్ద నూతన సంవత్సర వేడుకలతో సందడి చేశారు. పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే గ్రామాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఇంట కూడా సందడి నెలకొంది.



గజమాలతో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి



కోరుకొండ ఆర్‌సీఎం చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఫాదర్ జోసఫ్ తంబీ

**చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు**

మధురపూడి: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆదివారం వేడుకలు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కోరుకొండలోని ఆర్‌సీఎం, లూథరన్ చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి. ఆర్‌సీఎం చర్చి రెవరెండ్ ఫాదర్ జోసఫ్ తంబీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. 2023 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సరంలో భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. బైబిల్ పఠనంతో ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు జరిగాయి. బెల్లపు డేవిడ్, జ్ఞానేష్, కొల్లి జాకబ్, ఆంథోనీ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తర ద్వార దర్శనానికి వేళాయె

**నేడు ముక్కోటి ఏకాదశి పూజలు**

బిక్కవోలు: సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వరుని ఉత్తర ద్వారం దర్శించుకోవడానికి భక్త కోటి ఎదురు చూస్తోంది. ఏకాదశి నాడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు గరుడ వాహనాన్ని అధిరోహించి ముక్కోటి దేవతలతో భూలోకానికి దిగి వచ్చి భక్తులకు దర్శనమిస్తారని ప్రతీతి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. అనపర్తిలో వేణుగోపాలస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు, బిక్కవోలు లక్ష్మీనారాయణస్వామి, ఊలపల్లిలో వేణుగోపాలస్వామి, పందలపాక వేంకటేశ్వరస్వామి, పెదపూడి జనార్దనస్వామి తదితర ఆలయాల్లో పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పెదపూడి: హిందూ దేవాలయాల్లో సోమవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ భక్తులకు ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందని పెద్దాడలో ప్రముఖ వేద పండితులు మిక్కిలి దుర్గయ్యశాస్త్రి తెలిపారు. గ్రామంలోని మహాలక్ష్మి గోదాదేవి సమేత అభినవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశ సందర్భంగా విశేష పూజలు చేస్తారని చెప్పారు.

అనపర్తి: సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్థానిక పాతవూరిలోని సత్తి పోతారెడ్డి తేతలి రామిరెడ్డి రామాలయం, శాంతిపురం లక్ష్మీదేవి ఆలయంతోపాటు మండలంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, పాలక మండలి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



పెద్దాడలో ప్రత్యేక అలంకరణలో అభినవ వేంకటేశ్వరస్వామి



పందలపాక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

### స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ప్రారంభం



ఎస్‌ఈబీ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సోమశేఖర్

రంగంపేట: రంగంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) స్టేషన్‌ను ఆదివారం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పిట్టా సోమశేఖర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం అక్రమ తయారీ, రవాణాను అడ్డుకోవడం, ఇసుక అక్రమాలను నిరోధించడం దీని యొక్క ప్రధాన విధులన్నారు. సెబ్ సీఐ సి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ అనపర్తి నియోజక పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు సంబంధించి ఎస్‌ఈబీ స్టేషన్ ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాయవరం సీఐ వేణుమాధవ్, ఎస్ఐ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌సీఐ మేనేజర్ దంపతులకు సత్కారం

బిక్కవోలు: బిక్కవోలు ఎఫ్‌సీఐ మేనేజర్‌గా విధులు నిర్వర్తించి శనివారం పదవీ విరమణ చేసిన చెరుకుమిల్లి వేంకటేశ్వర వరప్రసాద్, ఇందిర దంపతులను ఎఫ్‌సీఐ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ అవినాష్ మాట్లాడుతూ వరప్రసాద్ తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం వరప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిక్కవోలు ఏరియా రైస్‌మిల్స్ ఏజెంట్ శ్రీను, ఎఫ్‌సీఐ సిబ్బంది పాల్గొన్నారు.



వరప్రసాద్ దంపతులను సత్కరించిన ఎఫ్‌సీఐ సిబ్బంది

## వైభవంగా షిరిడీ సాయి మహాస్థూపం ఆవిష్కరణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన 130 అడుగుల షిరిడీ సాయి మహాస్థూపం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. షిరిడీ సాయి సేవాశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా తెల్లవారుజామున సేవాశ్రమ వ్యవస్థాపకుడు అమ్ముల సాంబశివరావు గురూజీ సత్సంగ ప్రసంగం, బాబాకి హారతులు, సుప్రభాత సేవ, అభిషేకాలు నిర్వహించారు. వేలాది మందితో సామూహిక సాయి సత్యవ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. బాబాకి పూలతో చేసిన ప్రత్యేక అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.



ప్రత్యేక అలంకరణలో హసన్‌బాద షిరిడీసాయి

### ఆదిత్యునికి విశేష అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తిస్వామి, దేవరులు

పెదపూడి: జి.మామిడాడ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి స్వామికి ఆదివారం ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు భక్తులకు వ్రతాలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని పూజల్లో కూర్చున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేష్

సీతానగరం: రాజమహేంద్రవరానికి చెందిన హరిత న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. న్యూరో ఫిజీషియన్, స్ట్రోక్ వైద్యనిపుణులు డాక్టర్ క్రొవ్విడి రాజేష్, డాక్టర్ బి.వినీల, డాక్టర్ సత్యం రమేష్‌బాబు వైద్యసేవలు అందించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సుమారు 107 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆశ్రమ ప్రతినిధి సుశీల, క్రొవ్విడి భాస్కర ప్రసాద్, క్రొవ్విడి నరసింహారావు, యన్నమని వెంకట నారాయణ, సంగిశెట్టి వెంకటలక్ష్మి, మద్దుల ప్రభాకరరావు పాల్గొన్నారు.

### బాధ్యతాయుతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్

రాజానగరం: అటవీశాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, అప్రమత్తంగా ఉంటూ నిజాయితీగా వ్యవహరించాలని దివాన్ చెరువులోని ఏపీ ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్ అన్నారు. నూతన సంవత్సర వేడుకలలో భాగంగా అకాడమీలో శిక్షణ పొందుతున్న ఫారెస్టు బీట్, ఫారెస్టు సెక్షన్ అధికారులతో ఆదివారం సమావేశమయ్యారు. రానున్న మూడేళ్లలో అకాడమీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారి అనూష, ఎఫ్ఎస్ఓ పద్మజ, సూపరింటెండెంట్ జె.దామోదర్, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

### వీఆర్వో కుటుంబానికి ఆర్థిక సాయం

కాజులూరు: అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోలంక వీఆర్వో సాదు పుల్లయ్య కుటుంబానికి మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆర్థిక సహకారం అందజేశారు. వీఆర్వో సాదు పుల్లయ్యకు ఇటీవల కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో బ్రెయిన్ ఆపరేషన్ జరిగింది. మండల తహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది స్వచ్ఛందంగా రూ.25 వేలు సమకూర్చి ఆదివారం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పుల్లయ్య భార్య లక్ష్మికి అందజేశారు.



### భీమేశ్వరాలయంలో మంత్రి వేణు ప్రత్యేక పూజలు



భీమేశ్వరాలయంలో వేద పండితుల వేదాశీర్వచనం అందుకుంటున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణ(తారకేశ్వరరావు) ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భీమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, మాణిక్యాంబ అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించుకున్నారు. అనంతరం నంది మండపంలో వేద పండితుల వేదాశీర్వచనం అందుకున్నారు. షిరిడీసాయి మహాస్థూపం సందర్శించిన మంత్రి వేణు మండలంలోని హసన్‌బాదలో 130 అడుగుల షిరిడీ సాయి మహాస్థూపాన్ని మంత్రి వేణు సందర్శించారు. సాయిసేవకులు మంత్రి వేణుకు బాబా జ్ఞాపికను అందజేశారు.